# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-04-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఎన్నికల ఏర్పాట్లు, నిర్వహణ సన్నద్ధతపై పలు జిల్లాల కలెక్టర్లు ఈరోజు అధికారులతో సమావేశాలు నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు.**

2. **మేమంతా సిద్ధం బస్సుయాత్రలో భాగంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఈరోజు ప్రకాశం జిల్లాలో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు.**

3. **ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలను ఈ నెల 15వ తేదీలోపు విడుదల చేసేందుకు ఇంటర్మీడియట్ విద్యామండలి చర్యలు చేపట్టింది.**

4. **తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం రేపు శాస్త్రోక్తంగా జరగనుంది.**

5. **ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్-కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య ఈరోజు చెన్నై చిదంబరం స్టేడియంలో రాత్రి 7 గంటల 30 నిమిషాలకు మ్యాచ్ జరగనుంది.**

=========================

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులకు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై ఈ రోజు ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 10 వేల 608 సిబ్బంది అవసరం కాగా 11 వేల 103 మంది ఉన్నారని తెలిపారు. జిల్లాలోని వెయ్యి 763 పోలింగ్ కేంద్రాలకు కావలసిన సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు. ఓటర్లకు ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

-------------------------

ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ కోరారు. స్వీప్, చిత్తూరుజిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగంపై చిత్తూరు పట్టణంలో ఈ రోజు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటు నమోదుకు మరికొన్ని రోజులు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చిందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారు తప్పకుండా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు.

---------------------------

18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఈ నెల 14వ తేదీలోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. తిరుపతిలోని కలెక్టరేట్‌లో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కృష్ణకాంత్ పటేల్‌తో కలిసి ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో ముఖ్యమని ఈ విషయాన్ని యువత గుర్తించాలని కోరారు. స్వీప్ ద్వారా అవగాహన కల్పించడంతో ఓటర్ల నమోదు శాతం పెరిగిందని తెలిపారు. ఓటు నమోదు చేయడంతో పాటు తమ ఓటు ఉందా లేదా అన్న విషయాన్ని ఖచ్చితంగా తనిఖీ చేసుకోవాలని ఆయన కోరారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 2 వేల 130పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో 671సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని కలెక్టర్ వివరించారు.

---------------------------

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్ర ఈ రోజు ప్రకాశం జిల్లాలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చామని పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రతీ గ్రామంలో ఒక సచివాలయం ఏర్పాటు చేశామని జగన్మోహన్ రెడ్డి తెలిపారు.

---------------------------

ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలను ఈ నెల 15వ తేదీ లోపు విడుదల చేసేందుకు ఇంటర్మీడియట్ విద్యామండలి చర్యలు చేపట్టింది. జవాబు పత్రాల మూల్యాంకనం, మార్కుల స్కానింగ్‌కు సంబంధించిన ప్రక్రియ నిన్నటితో ముగిసింది. మూల్యాంకనాన్ని మరోసారి పునఃపరిశీలన చేసేందుకు వారంరోజులు సమయం పట్టనుంది. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరగగా.. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షలకుపైగా విద్యార్థులు హాజరయ్యారు.

---------------------------

తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం.. షార్ నుంచి నిన్న ఉదయం చేపట్టాల్సిన చెన్నై అంతరిక్ష స్టార్టప్‌నకు చెందిన అగ్నిబాన్ రాకెట్ ప్రయోగం సాంకేతిక సమస్యలతో మరోసారి వాయిదా పడింది. ప్రయోగానికి 92 సెకన్ల ముందు అగ్నిబాన్ రాకెట్ ప్రయోగాన్ని నిలిపేశారు. షార్‌లోని అగ్నికుల్ ప్రయోగ వేదికలో పరీక్షా రాకెట్‌ను మొదటిసారిగా గత నెల 22వ తేదీన ప్రయోగించాలని భావించినా, కొన్ని కారణాలతో వాయిదా వేశారు. రెండోసారి గత శనివారం ప్రయోగించాలని ప్రయత్నించి నిలిపేశారు. తాజాగా అగ్నిబాన్ రాకెట్ పరీక్షా ప్రయోగాన్ని మరోసారి వాయిదా వేశారు.

---------------------------

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది. అందులో భాగంగా 85 ఏళ్లు పైబడినవారు, 40శాతానికిపైగా అంగ వైకల్యం ఉన్నవారు ఇంటి నుంచే ఓటు వేయవచ్చు. నిబంధనలకు అనుగుణంగా ఓ కంపార్టుమెంట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ను తీసుకువచ్చి పోలింగ్ సిబ్బంది ఓటరు ఇంటి వద్దకే వచ్చి ఓటు వేయించుకుంటారు. ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటును ఉపయోగించుకోవాలనుకునే వృద్ధులు, దివ్యాంగులు

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన 5 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం ఫారం 12డి ని రిటర్నింగ్ అధికారికిగానీ, సహాయ రిటర్నింగ్ అధికారికిగానీ పంపించాలి. దరఖాస్తు చేసుకునేవారు తమ పూర్తి చిరునామా, సంప్రదించాల్సిన ఫోన్ నంబరు పొందుపరచాలి. ఈ దరఖాస్తు ఎన్నికల సంఘం వెబ్ సైట్లో అందుబాటులో ఉంది.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం రేపు శాస్త్రోక్తంగా జరగనుంది. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రేపు స్వామివారి ఆలయంలో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థనం రద్దు చేసింది.

---------------------------

పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు సూచించారు. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నందున ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. పంచాయతీరాజ్, మున్సిపల్, గ్రామీణ నీటి సరఫరా, వైద్యారోగ్య శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. చలివేంద్రాలు పనిచేసేలా చూడాలని, అవసరమైతే అదనంగా ఏర్పాటు చేయాలని.. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని దిశానిర్దేశం చేశారు. చిన్నారులు, గర్భిణులు, వయోవృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

---------------------------

ప్రతి భారతీయుడి మదిలో దేశభక్తిని పెంపొందించే వందేమాతరం గీత రచయిత బంకించంద్ర చటోపాధ్యాయ వర్ధంతి ఈరోజు. బెంగాలీ కవి, రచయిత, పాత్రికేయుడు అయిన ఆయన... తన రచనలతో స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలను ఉత్తేజ పరిచారు. దేశభక్తిని ప్రబోధిస్తూ ఆనందమఠ్ నవలలో ఆయన రచించిన “వందేమాతరం” స్వాతంత్ర్య పోరాటంలో ఒక నినాదంగా మారింది. ఈ గేయాన్ని బహిరంగంగా పాడడాన్ని నాటి ప్రభుత్వం నిషేధించింది. అయితే ఈ నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తూ 1896 కాంగ్రెస్ సభల్లో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ బాణీ కట్టి గానం చేశారు. మాతృభూమికి వందనం సమర్పించే వందేమాతర గీతాన్ని అందించిన బంకించంద్ర 1894 ఏప్రిల్ 8వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

గడిచిన ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్ఆర్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలోని పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లె, కమలాపురంలో ఆమె నిన్న బస్సుయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేశారని.. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రాజెక్టుల నిర్మాణాలపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైఎస్ఆర్ జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటై ఉంటే ప్రత్యక్షంగా 25వేల మందికి, పరోక్షంగా మరో 20 వేల మందికి ఉద్యోగాలు వచ్చేవని.. గత ఐదేళ్లలో శంకుస్థాపనలే తప్ప పరిశ్రమ ఏర్పాటు కాలేదని షర్మిల ఆరోపించారు.

---------------------------

మా తెలుగుతల్లికి మల్లెపూదండ గేయరచయిత శంకరంబాడి సుందరాచారి వర్ధంతిని తిరుపతిలో భారతీయ జనతా పార్టీ సాంస్కృతిక విభాగం నాయకులు ఈరోజు ఘనంగా నిర్వహించారు. తిరుపతి–తిరుమల బైపాస్ రోడ్డులో ఉన్న శంకరంబాడి సుందరాచారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులు గుండాల గోపీనాథ్ మాట్లాడుతూ.. తెలుగువాడి కీర్తి బావుటాను ప్రపంచ నలుమూలలకు తెలియజేసిన గొప్ప వ్యక్తి శంకరంబాడి సుందరాచారి అని కొనియాడారు.

======================